శ్రీ

పాద్యము

రచన:
మహాకవి, సరస్వతీపుత్ర, పద్మశ్రీ
"పుట్టపర్తి"

ప్రతులకు:
పుట్టపర్తి నారాయణాచార్యులు
కడప.

శ్రీర్జయతు

మున్నుడి

నా గురువు పరమేశ్వరుఁడు అతడిప్పుడున్నాడు. లేడు. ఎప్పటికీ వున్నాడు. దివ్యభావాలైన, ప్రేమా, భక్తీ, మొదలైన వాటికి, నశ్వరత్వమూ, భౌతికమాలిన్యమూ లేనట్లే, వాని లక్ష్యాలకు కూడా లేవు. ఈ సత్యాన్ని గమనించిన, అనుభవించినవారు- ఋషులు- కవులు.

నేనీ గ్రంథం వ్రాయునాటికి, మరాటీలో "సంత సాహిత్యాన్ని" యెక్కువగా చదువుతూ వుండింది నిజం. ఆ పోకడలే దీని రచనకు దోహదాలు. సృష్టి మాది. అనుభవించే రసికత సహృదయులది. ఇప్పటి కింతే.

"పుట్టపర్తి"

పాద్యము

తరుణాబ్జతుహిన ముక్తామాలఁ బోలునే
త్రిముల దయార్ద్రబాష్పములతోడ
గంభీరభావ నిష్కలుషదీప్తులు పర్వి
యొరపెట్టి విడిచిన పరిధితోడ
నవరసాలకిసాల పవిమలారుణకాంతి
నొడి గొన్నజుంజురు జడలతోడ
నావంటిపతితు లెందరినైన రక్షింపఁ
జాఁచిన యభయ హస్తంబుతోడ

యజ్ఞవేదికవలె బవిత్రారుణములు
నిండుచూపులు దిక్కులనిండి వెలుఁగ,
మాగురుస్వామి! నాపాలి మధురమూర్తి!
వచ్చినాఁడమ్మ! మాయింటివఱకు నేఁడు.

ఆ మహాఋషి చూపులయందుఁ బొడమి
జీవకారుణ్య మెల్లడఁ జిలికినదియొ!
నామనోహరు హృదయమంటపమునందు
వేద విజ్ఞాన దీపముల్ వెలసినవియొ!

పుట్టినది మొదలింత నవ్వుటకుఁగాని
భాగ్యమే లేనియట్టి యభాగ్యుమీఁదఁ
గరుణవారినదేమి! యెవ్వరును లేరె
పాత్రములు నీదు హృదయ సంస్పందమునకు! 3

భయము గలిగించు నొక యమావాస్యనాఁటి
వితథశర్వరిఁ బోలు జీవితమునాది,
లోకములు వెలిఁగించు చంద్రుఁడవు నీవు
ఎక్కడి ఋణానుబంధమోయీ! గురూజీ! 4

వాసనయెలేని క్షుద్రపుష్పమ్ము నెవరు
తలధరింతురు? రాలిపోవలెనెగాని,
బ్రదుకుజీకిన నాప్రేతహృదయ మెంత
యింపుగానందు కొంటివోయీ! మహర్షి! 5

శాక్యముని మాలవానిజర్జ రితకుటిని
పూతమొనరించెఁ దేనెచూపులను నాఁడు
ప్రవిమలంబైన నీ పాదరజము నాయ
దృష్టమున నూత్నరేఖ దీర్చినది నేఁడు. 6

సద్గురూ! నాకు నానాఁటి శ్వపచునకును
సామ్య మిసుమంతలేదు నిశ్చయము గాని,
నీవు మాత్రము పాపపఙ్కిలజగంబుఁ
పూత మొనరించు బుద్ధదేవుఁడవె, నిజము. 7

కారణము లేకయే బహిష్కారమునకుఁ
బాత్రమైనట్టి నావంటి పతితుమీఁదఁ-
జచ్చుటకై జన్మమెత్తిన జడునిమీఁద-
నింత నీదయ ప్రసరించు టేల? తండ్రి! 8

నిండు పున్నమనాఁటి వెన్నెలల నడుమ
గ్రుడ్లగూబకై విలపించు కుమతు లెవరు?
నాగురూ! నీ యలౌకికానందమందుఁ
గానఁబడె నేమొ! దీనుని కరుణగాథ. 9

అయువంతయుఁగూడ నిరాశతోడఁ
గడచినది-శుభాకాంక్ష యెన్నఁడును లేదుఁ-
నా ప్రభూ! నీవు వచ్చుట నమ్మలేను,
పుణ్యములపంట! నమ్మక పోవలేను. 10

కలవలె హఠాత్తుగా వచ్చి నిలిచినావు
తండ్రి! పతితుని యీ గృహాంతరమునందు,
సత్యమునువోలె నెపుడు శాశ్వతముగాఁగ
నిండుచూపుల నన్ను మన్నింపవయ్యా! 11

నా కలుషములు గొలువఁ మానములు లేవు,
నా వ్యథల నెఱిగించు వాఙ్మయములేదు,
నా కనులనీరు నిల్వ సంద్రములు లేవు,
నన్ను రక్షింపుమని పల్క నాల్కలేదు. 12

ఈ దరిద్రుని హతకుటి నెందుఁగాని-
కోమలంబైన హృదయంబుగూడ లేదు,
విమలనైవేద్యమునకు దీపములు లేవు
కనులలో భక్తికిరణ రేఖయును లేదు. 13

నిన్నుఁ బూజించు నాసజనించెఁ దొలుత
నర్హుఁడనెయన్న సందేహ మవలఁ గలుగు
దాఁచినకరంబు వెనుకకుఁ దగ్గిరాదు-
తిగిచినకరంబు ముందుకు నెగసిపోదు. 14

పలుకరింత మటంచుఁ గోర్కెలు జనించు-
నింతలో సిగ్గు నన్నావరించుకొనును,
భావశబలత్వమునుఁ దీసివైవలేను-
పూజనేయు పేరాస చంపుకొనలేను. 15

నీ యెదుట నేను కైమోడ్చి నిలిచినపుడు
మనసునకుఁ దోఁచు నా చిన్నతనము నాకుఁ
దనువుఁ గంపించు, గుండెలు దద్దరిల్లు,
నా యవస్థితియే పోవునా! యటంచు. 16

బాష్పపూరంబుతో నీకుఁ బాద్యమిత్తు
ననుకొనెదఁగాని, ప్రతిజలకణముగూడఁ
బరమపూతంబు-దమ పేరు-పలుకదేమొ!
యన్న సందేహమునకు రిక్తుఁడై నిలుతును! 17

మనసు మెదలదు-గన్నులఁ గనవు,-పలుకు
బయలు దేరదు ఉపచార వాక్యములకుఁ-
బ్రభలు చల్లునివాతదీపంబు నీవు.
మోహనంబైన యొక ముగ్ధపూజ నాది. 18

సద్గురూ! నీవు నేలపైఁ జరణములిడి
వచ్చునపుడు నాయెదపైన నడచి
వచ్చునటులుండు. రెక్కలు పట్టుకొన్న
కొదమతూనీఁగవలెఁ గొట్టుకొందు నేను. 19

లౌకిక విషాదములగుండె రగిలి రగిలి,
నీచరణసీమ నాశ్రయించితిని నేను
తండ్రి! యిట నొక్క నూత్నానుతాపమునకు
నన్నుఁ గురిసేతుఁ వేమి యన్యాయ మోయి! 20

ఏడ్చుటకునై నఁదోప నీదేమి-తండ్రి!
ఈ హృదయవేధ నింక సహింపలేను,
జ్ఞానమునకన్న నాకు నజ్ఞాన మొసఁగి,
నీకనుల నీలి నీడ మన్నింపవయ్యా! 21

గాలి బోరున వీవఁ వృక్షములు విఱిగి
నాశనంబైన భయదకాననము వోలు,
నా యెడందలో-నింకొక్క-నాఁటి కేనిఁ
దీర్చికొందును నా గురుదేవు ప్రతిమ. 22

నే ననెడు భావమునఁ దెగనీల్గిపోవు
శిరము, వంచితి గురుదేవు చరణసీమఁ
జేరదేసి కన్నీరు రాల్చితిని నాఁడు
బ్రదుకు-గూలిన యొక బీదవాఁడు వోలె. 23

తాను నాతోడ మందమందాక్షరముగఁ
బలికెనఁట నేదొ—యమృతపిచ్చిల సుగంధ
మైన నాగురుదేవుని యభయహస్త
శీతలచ్ఛాయలో సొగసితిని నేను. 24

నాతలఁపుపంట-నావాఁడు నాథుఁడపుడు
పలికిన వచస్సులవి వినఁబడనె లేదు,
గట్టులొరసిన కన్నీటి కాల్వయందు
పరమగురుమూర్తియును గనఁబడనె లేదు. 25

భిన్నతర నైకభావనావేశములను
గలసి వర్తించు సుఖదుఃఖములకు నడుమ,
నొక విచిత్రపు భావ ముబ్బూఁత లూఁచె
జీర్ణహర్షము—నాప్రేత చిత్తమపుడు. 26

ఎన్నినిముసము లట్లు పోయినవొ యేమొ!
అంతలోఁ దెల్వి దయ్యమై యావరించెఁ
బరమ పూతంబు గురుదేవు పాదసీమ
రాలియుంటిని జీర్ణపత్రమ్ము వోలె. 27

* * *

పరులఁ బ్రశంససేసి నవ
భాగ్యములందుటకంటె, నాత్మ సు
స్థిరుఁడయి పుష్కపాత్రమునఁ
దిన్నను నామదిఁజింతలేదు, యీ
శ్వరు గుణతంత్రగీతములఁ
బాడుదుఁ జిక్కనిపూవువోలె, నా
పరువము వాడకుండ
నిలపైమని, రాలినఁజాలు సద్గురూ!

వేదనా శతకము

—:o:—

నీవొక దివ్యదీపమయి, నీ వెలుఁగుల్ప్రసరించుచోట-నా
జీవితరేణు వింత వికసించినచో మదిఁజింత లేదు, స్వా
మీ! వెలకట్టరానిది సుమీ, భవదీయ ఋణంబు లీనమై
పోవును నా కృతజ్ఞత ప్రభూతము నీకరుణాంబురాసిలో. 1

నీ కనుఁగోనలందు వెలినీడలు వోసెడు నట్టి లోక ర
క్షాకరకాంతిరేఖల వికస్వరమైనది నాయెడందలో
రేకులువిచ్చి-నీవు విదలించిన నవ్వులు క్రొత్తతావులై
ప్రాకినవయ్యా! యీ పసితలంపులఁ జిక్కని నోముపంటలై. 2

నేనొక పూలమాలనయి, నీచరణాంబుజ సీమఁబండి, య
మ్లానములైన వాసనలు రాలిచిపోవలెనంచుఁ గోరుకొ
న్నాను ప్రభూ! దురంతతమసాంతరితంబగు జీవితంబుతోఁ
గానని కోర్కెకై-గనులు కాయలుగాయఁగఁ గాచియుండెదన్. 3

'నా'యని చెప్పి కోఁదగు మనస్సులు లేకయె కుంది, నారక
ప్రాయములైన జీవిత విలాసములన్ దురపిలుచున్న శు
ష్కాయువు నాకు-నీవొకఁ డఖండరసాకృతిఁ దోఁచి పిచ్చియై
పోయె నిదేమి కర్మము ప్రభూ! నిను నెంచుట పెద్దదుఃఖమై. 4

నీవు వచించినట్టి రమణీయవచస్సులు మాటిమాటికిన్
భావన సేయునప్పుడు భవన్మృదు రూపముమ్రోలనిల్చిన
ట్లై, వెతఁగుంది నేనణువునై ధరలోనికిఁ గ్రుంగిపోదు, ల
జ్జావివశంబు-నాయెద-ప్రశంసయొనర్పదు మూకవీణయై. 5

నీచిఱునవ్వు దివ్యతటినీవిక చామ్బుజమంజులంబు, కా
నీ చవిలేని నాతలఁపు లీసొగసుందన మోర్వలేవు-న
న్నేఁచును దీవ్రమై యపనయింపఁగ సాధ్యముగామి, దుఃఖకీ
లాచిత బాష్పపూరముల రాల్తును ధారలుగాఁగఁ గన్నులన్. 6

ఆశానిరాశయై బ్రతుకునందు నశించుట దప్ప-వేరు వి
శ్వాసములేనీ నావలపు పంటగఁ దక్కితివన్న యా సమా
శ్వాసము మాసిపోయినది స్వామి! వియోగము సైఁపలేని యా
వేశము-ఘోరమై బ్రదుకుఁ బీల్చిన దొక్క మహాజలూకమై. 7

స్వామి! భవత్పయోజపదసన్నిధి నాదురవస్థ దెల్పి-న
న్నోము మటంచుఁ జెప్పికొన నూహజనించునుగాని, యంతలో
నేమొ వచింపరానిది గ్రసించును-సిగ్గు-మదీయ శీర్షమే
భూమికిఁ గ్రుంగి, చొచ్చుకొని పోవును చీఁకటిలోఁతుదారులన్. 8

నీమహనీయ తన్దెలియనేరఁగనైతి నటన్న చింత నెం
దో మతివోయి యాకులతఁ దూలఁగఁ గ్రొత్తమొగిళ్ళ పుప్పొడుల్
బ్రామిన వింతనవ్వులను రాల్చిననున్ గెరలించివైతు స్వా
మీ! మరి నేను నవ్వెదను మీకయి-వాసనలేని నవ్వులన్. 9

నీ యమృతంపు నవ్వులకు నిష్ఠురభావము కవ్విరేఁగు నే
మో! యెదురై యెండద కొనఁబుట్టును-నల్లని త్రాఁచువోలె, బా
ధాయిత హాస, మింతకును దథ్యమ-యేడువలేని నవ్వు తం
డ్రీ! యది భావనాబలము డీల్పడిపోవు సమన్వయింపగన్. 10

నీ చరితామృతంపురుచి నిండిన నామదికన్యసత్కథల్
వాచవిగావు రేవగలు భావనకందని నీ స్వరూపమున్
యోచన చేసిచేసి వెడయూహలు మ్రోడులెయయ్యె సేవకున్
గాచిన జీవితంబునకె గల్గదు శాంతిలవంబు నేఁటికిన్. 11

నాగురుదేవ! నాయెదుట నాట్యము లాడిన యట్లు దోఁచి యెం
దేగితివయ్య? ముందు నటియింపక యీ విరహవ్రతంబుతో
వ్రేఁగెడు దుఃఖజీవిక భరింప, భరింపఁగనీవు, నీవు నా
పైఁ గురియించినట్టి యనుభావ్యల సత్కరుణా విశేషముల్. 12

నాకవితా ప్రసూనము లనారతమున్భవదీయ మంజుల
శ్రీకరపల్లతావిచికిలీకృతచిత్తములై, మరందధా
రాకలహర్ష జీవనవిలాసములన్ నటియించి రాలిపో
వీకమనీయ రూపములు! నీచిరునీడలు ప్రాఁకు చోటులన్. 13

నీవొకసారి చూచిన ఘనీకృతి నొందిన నాయెదంద-చిం
తా వివశమ్ము-మత్తుగొని దాఁటులు గొట్టును లేడిపిల్లయై
నీవొకసారి నన్ను గమనించుచు ఫక్కన నవ్వినంత నే
పూవులుగాఁగ రాలిపడిపోవును జీవితకాంక్షలన్నియున్. 14

తలపయిఁజిన్ని చుక్కలవితానముఁ గప్పిన యట్టులున్న పా
టల మసృణంబు సుందరజటావలయంబు నటింపఁ, గన్నుఁగో
నలఁ గళలూరఁగా నిలుము నాయెదుటన్, దడికంటివిచ్చుఁ జూ
పుల నమృతంబు ధారలయి పోవఁగ శాంతినీ గౌగలించెదన్. 15

ఏనుభవద్వియోగము సహింప నటంచును జెప్పఁబోవ, నే
దో నెపమొడ్డి నాతలఁపుఁ దుంటలు గొట్టెదు నవ్వి నవ్వి, నా
ప్రాణము లేల దీసెదవు స్వామి! యిటే బ్రదుకంగనైన నీ
వో ననువెంటఁదీసికొని పో బ్రదుకున్ మరిభారమైనచో. 16

నాగృహమందె నిల్తునని, నాకుసుమార్చనయే గ్రహించి న
న్నేగయి కొందునంచు-వచియించి, యమాయికమౌ నెడందలో
మ్రోగఁగఁజేసి తాళలు ప్రభూ! కనుపింపవు-చూచి చూచినా
మూఁగతలంపు లన్జిదికిపోయిన వెన్నియు యుష్ణబాష్పముల్. 17

నేనొక గొప్పవాఁడనని నీకడడాబులు గొట్టలేదు, తం
డ్రీ! ననువంటి పాపిని భరింపగ లేదిల, కాని త్వత్కృపా
నూనపవిత్రదేవధుని యుబ్బట లూఁగినచోటఁ బాపచిం
తానిబిడాట్టహాసములఁ దట్టఁగవచ్చున యేమిరా, ప్రభూ! 18

కాయలు కాచనేమొ నిడుగన్నులు నీకయి కాచి కాచి? తం
డ్రీ! యిఁకనైన నాశ్రమ గణింపవు పైని పరీక్షసేతు వే
మీ? యిదె-బాకు-చీల్చికొను మీ యెదశోధన సేసికొమ్ము దీ
క్షాయుతమైన నా హృదయ సద్మమునే పెనుదివ్వె యేలునో! 19

గుండెలు గ్రుళ్ళి యేడ్చుటకుఁగూడ గళంబునఁ జెమ్మలేక భ
క్తుండు జపించునంత కొనగూడదొ నీదయచాలఁ నాకు, వే
దండము ద్రొక్కనోర్చు నెలతాపటలంబు? పరీక్షనెగ్గు యో
గ్యుఁడగు నేని నీకరుణఁ గోరునె? వడ్డికెజెల్లు కోవవో? 20

పతితుఁడ నేను, నా పతితపావనమూర్తివి నీవు, తీవ్ర శా
శ్వతములు-పోరు లిర్వురకు సంధిలెఁ- బాపమొనర్ప నా కళం
కిత మతి కెగ్గులేదు, చిలికింపవు జెమ్మెట నీవు పాపసం
తతిఁబడఁగూల్పజూడవలెఁదండ్రి! మరెవ్వరు గెల్చుకొందురో! 21

నీవు పరీక్షసేసెద వనేకవిధంబుల నన్ను, నీ పరీ
క్షావిధి కాఁగలేక కలుషఁబున నిందయొనర్తు నిన్నుఁ, గా
నీ వెనువెంటనే యెడఁదనిల్చును నీదయ-వానకాళలై
పోవును గన్నులందుఁ బడిపోదును కూలిన పెద్దవృక్షమై, 22

పాపము చిట్లి-నెత్తిపయి ఫక్కున నవ్వఁగ సోలి, లోక నిం
దాపరిశీర్ణజీవితమునన్ లవమూరట లేకయే, వృథా
శాపుటపాకవేదనలు చంపినఁ జావక నిల్చినాఁడ నీ
నాపయినా భవద్రభసన్యాటము? న్యాయము నీకు, సద్గురూ! 23

ఎంతగ నేడిపించెదవొ? యీ జడకాష్ఠము నేడిపించి నీ
పంతము దీర్చుకో! తనువుఁ బాసినఁ బుణ్యమె పండిపోవు ని
శ్చింతతఁ బోదుఁగాని, ననుజీవముతో మననిచ్చి, కష్టముల్
వంతకుఁదెచ్చి, గ్రుమ్మకమ ప్రాణము-నీకు నమస్కరించెదన్. 24

నా దురవస్థ లెంతటి ఘనంబులొ, తండ్రి! రవంత యేని నా
పై దయగల్గదే? వికలభావముతో సుడిఁజుట్టు కొంచు ని
ట్లే దరిలేని యీ భవము నీఁదఁగనేవలె నేమి! యాత్మస
మ్మోదము లేదొ? యెన్నటికి మోక్షము లేదొ? విపన్నజీవికిన్. 25

బాంధవులేల నన్నుఁగని పల్కరటంచన-నీకు రాముఁడే
బాంధవుఁడన్న మంత్రమును బట్టుగ నాయెద గ్రుడ్డిమోహ సం
బంధము ముళ్ళుదీసితిని-స్వామి! గదా, మరినీవె యిప్డు శో
కాంధునిఁజేయివీడిన నిఁకన్ గతి యెవ్వరు? నాకు సద్గురూ! 26

తల్లి గతించిపోయినది-దండ్రి దరిద్రతఁ గ్రుంగె-నింకనా
తల్లి యుఁదండ్రినీవె గద! తథ్యముగా నునుపాల వెన్నెలల్
చల్లు నెడందతో మనిచి, చక్కని శిక్ష యొసంగి, క్రమసం
ఫుల్లము-జీవితం బొసఁగి-ప్రోచుట నీపనికాదొ? సద్గురూ! 27

రాముఁడు నాకు నీవెయయి రక్షయొనర్పుము లేనిపోని పో
రాములు గట్టిపెట్టుము, పరాత్పరుఁ డన్నను వేరులేదు, తం
డ్రీ! మరినీవె జిత్తులఁ జలింపఁగఁ జేతువు, చూచినాములే-
నీమరియాద-నీయడుగు నీడలనేఁ బెనవైచి చుట్టెదన్. 28

ఒకపరి నీవు నావలెనె యొక్క మనుష్యుఁడ వింతవాఁడవై
సకలము నాక్రమించుకొను శక్తి నదెక్కడ మోచితంచు మా
మకహృదయంబు పల్కు-ననుమానముఁదోచును, వెంటవెంటనే
తికమకలౌదు, పంకిలమతిన్ సుడిఁజుట్టెదనన్ని చింతలన్. 29

నీవదనంబునన్ మనసునిల్పిన యొక్కనిమేష మంతయున్
నీవయి దోఁచు-నాకనుల నిండును బచ్చి వెదుళ్ళకాంతి యే
మోవినిపించు, నాయెడఁదమోసల వైదికఋక్సమూహ తం
త్రీవిశదామృతస్వనము నిండుతనంబులు క్రేళ్ళు దాఁటఁగన్. 30

కాంతులు జారిపోవు కడకన్నులతో ననుఁజూచి యాన వె
ట్టింతువు పాడుమంచు నపుడీయెద పెళ్లన వ్రీలునో స్మయో
ద్భ్రాంతమటంచుఁ దోఁచెడును, స్వామి! నినున్ గనుఁగొందు-వేదనా
దంతురితంబునా పెదవి దాఁటులు వెట్టును దుఃఖబాష్పముల్. 31

అసలు దూయు నీ మృదు దయాపవనంబులు వీఁచునంత, స్వా
మీ! పివమెత్తు సమ్మదము-మేను హఠాత్తుగ విస్మరించి, నీ
నాసముఖంబునన్ గలుగ నంతరముదల వోయకేమి యో
యీ!-సఖ! యంచుఁబిల్తుమని యెంతును నా హృదయాధినాధునిన్. 32

మోయఁగరాని చెడ్డతలఁపుల్ పెనునాగులు వోలె నాల్కలన్
నాయెదఁగ్రోయు-నిల్పుకొన నా వశమా? గురుదేవ! చిత్త భూ
షాయిత మూర్తివై వెలుఁగుఁ జల్లుచు నిల్చినఁగాక పాప కీ
లాయుత జీవి కర్కశవిలాపము లెవ్వరు వింద్రు? సద్గురూ! 33

మాటికి మోసులెత్తుక సుమాలపు భావము లప్పుడప్పుడే
సూటిగ గల్లివైచిఁ దెగఁజూతును, కాని యనేక జన్మ స
న్నాటితమైన యీ పశుత నన్నుఁ దెమల్చుకొనంగ నీద, యు
త్పాటిత బుద్ధినై సుఖము పజ్జలఁబారుదు వెఱ్ఱివాఁడనై. 34

అఁచెడు భావముల్గలఁచునప్పుడు, ధార్ష్ట్యముతోడ నేఁదెగం
జూచెడునప్డు, నీవు ననుఁ జూడవలెన్ ప్రభు! యూర్పు మంటలన్
గ్రాఁచిన దేహమున్ యెలుఁగురాలిన కంఠమునౌచుఁ దీవ్ర చిం
తాచితుఁడౌచుఁ జుట్టుకొని తల్లడమందుదుఁ ద్రాచుపోలికన్. 35

పరులుత్సాహము మోములందు వికసింపన్నవ్వఁగాఁ జూచి, యీ
శ్వరునే పూవులఁ బూజఁజేసిరొ గదా వారంచు! వాపోదుఁ దం
డ్రి! రవంతేనియు నవ్వు నాకెపుడు రానేరాదు-నాకర్మమే
మిర? యేదో యొక చింతపట్టికొని నన్ మ్రింగున్ దివారాత్రముల్. 36

ఒక్కొకసారి నవ్వెడు సుయోగమె జన్మకు లేదటన్న, పెన్
కక్కురితిన్ ముధాహసిత కల్ప మొనర్తునుగాని, బాధచేఁ
బొక్కుదు-రంగు కాగితవుఁ బూవులఁబోలిన యెండు నవ్వులో
నెక్కడి శాంతి! పైని దహియించును రేఁగెడు క్రొత్త దుఃఖముల్. 37

గుండెలుదన్ని ప్రాణములు గ్రుమ్మెడు దుఃఖము వోవునట్లుగా
దండిగ నేడ్తమన్నను వృథాదురహంకృతి యేడ్వనీదు-పె
న్కొండలవంటి దుఃఖముల కున్మదియాగదు నిల్చి, తండ్రి! యీ
యెండినకట్టె బాష్పజలమే గఱవైనది, నా యభాగ్యతన్. 38

ఏడవకున్న గుండెలవియించును బెన్వగపున్న బాష్పముల్
గూడ శుగగ్ని కుణ్డమునకున్ నుసియైనవి లేవు-ప్రేమరా
పాడఁగ దండిగా నొసఁగి బాష్పములై నను-నాసదీర న
న్నేడువనైన నీవు! యిది యేమి యనర్థమురా! జగత్ప్రభూ! 39

నవ్వులు భాగ్యవంతులకునై ముడివేసి బిగించినారు పో,
నవ్వెడు భాగధేయముల నాదృత జన్మకు లేవు, పోవనీ
నవ్వక యేడ్చిపోదమనినన్ మఱితోఁచదు-దైవదృష్టిలో
నవ్వకుఁబోలె నేడ్పునకు నాణ్యము హెచ్చినదేమిరా? గురూ! 40

పరసతులన్ గనుంగొనినఁ బాడుమనంబొక పిచ్చికుక్కయై
పరుగిడు నైతికంబులగు బంధములన్ దెగదూసి వెంటనే
మెఱయునిరమ్మదమ్మువలె మీ హితబోధలు-వీనిమధ్య, నా
యురమొక శుష్కకాష్ఠమగునో? తెగఁగాలునొ? యంచు నేడ్చెదన్. 41

అపుడపు డాత్మవంతుల-మహాత్ముల జీవితముల్వఠించి, నే
నెపుడెపుడంత యౌదునని యిబ్బడియౌ కుతుకంబుతోఁ బ్రయ
త్న పడెదఁగాని, నా తెగువ దగ్ధమగున్-బయి నెత్తివచ్చు ని
ష్కృపములు విఘ్నముల్ ననుఁదరింపఁగనీయవు, తండ్రి! నాగురూ. 42

కలుషితవృత్తి నొక్కడపకార మొనర్చిన దాని నోర్చికోఁ
గలుగుటయే గదా, నిజముగానమరత్వమటన్న! బుద్ధి సి
చ్చలు మదినిల్వ దాక్షణమశాంతిని వీడి దురాగ్రహవ్యధా
కులితుఁడనై నటింతు, నొక క్రోతిగ-నొక్క పిశాచరీతిగన్. 43

పరులను నిందసేయుటది పాపము-గాని రవంత నా మనోం
తరమున నొవ్వగల్గినఁ గృతాకృత చింతలు మాని, రేఁగి, ని
ష్ఠురముగఁ దిట్టుదున్-బిదప సూడును నన్ననుతాపమప్పుడున్
బురపురఁ బొక్కుదున్-దెలివి మూఢతనొందెనటంచు, నాగురూ! 44

పూఁపవయస్సులో నుడుకుఁబోతు తనంబది, మంచి చెడ్డలన్
దోఁపఁగ నీదు, తండ్రి! నగుదున్ బెరవారలఁజూచి నేనె వి
ద్యాపరిణాహశాలినని-తథ్యముఁ జూచిన నేనెపో యవి
ద్యాపరిరంభజాల్ముడను-దర్పచర ప్రవిలుప్త చిత్తుఁడన్. 45

గగనమునందసంఖ్యమయి కాంతి వెలార్చెడు తారకాసుమా
ళి! గనినయప్డు చేతము జ్వలించును-నే కవినన్న భావమున్
పెగలయి పోవునూరుపుల-జీవితమొక్క నిశీథమౌచు నె
వ్వగలఁ దపింతు నేకతమ-పాపము పండిన గ్రుడ్లగూబనై. 46

శాంతి యలభ్యయోగమని సత్పురుషుల్ వచియింప విందు, నా
స్వాంతము వేటకుక్కవలె జఱ్ఱున దాఁటులుగొట్టుఁ, దండ్రి! నే
నెంతగబట్టికొన్న గ్రహియింపదు నాగతియేమి! ముక్తి శు
ద్ధాంత వినోద! దీనజనతావన కారణజన్మ! నాగురూ! 47

ఆలయభూమి దోఁచెడు ప్రయత్నముఁ బూనిన చోరులన్ ధను
శ్శాలులు రామలక్ష్మణులు చక్కియ నిల్చినవారు-తద్విభా
గోళముఁ జూడలేక పడఁగూలిన, వేకువ రాముఁ గన్నులన్
గ్రోలిన భక్తులంచుఁ బలుకున్ దులసీ ప్రభుఁ డెంతధన్యుఁడో? 48

ఒక యవివేకి యాగ్రహమునూని పదాహతిడుల్ల నేసినన్
బ్రకటము సేయఁడా-మధురబాబుకుఁ-దన్గనికొల్చు ధర్మక
ర్తకు-యతి-రామకృష్ణుఁడు, పరప్రతిహింసకుఁ దల్లడిల్లి, య
త్యకలుషవృత్తి ముగ్ధ హృదయంబున కెంతతి శాంతిరా! గురూ! 49

ఒక పని ముందు వెన్క లను యోచనలేక ముగించివైతు, మ
స్తకమున దయ్యమూనినటు, స్వామి! యనంతరమూహసేసి యూ
రక పరితాపమంద కనులన్ సలిలంబులు చిమ్మిపోతు, నీ
వికలితబుద్ధి కెన్నఁడు వివేకము గల్గి తరించురా, గురూ? 50

త్యాగము-భోగవృత్తి కొకయంగముగా సవరించి, భోగముౝ
ద్యాగపరంబుగా వెలసిరంట మునుల్-మిముఁబోలె, వారి సూ
త్రాగమపఙ్క్తి భావముల యందు లగింపక, వెఱ్ఱివాఁడనై
యీ గతి నొక్క వెఱ్ఱిబ్రతుకీడ్తును-దుస్తర దుఃఖభీమముౝ. 51

జనకునివంటి యొక్కరుఁడు సత్యమొ! యూరటలేని శుష్కక
ల్పనమొ యటంచు నెంచెదను, భావనకందదు-త్యాగభోగముల్
పెనఁగొనినట్టి జీవితము-వేసటసోలుదు, తండ్రి! గోరువె
చ్చనివగు నూర్పులే మిగిలి శాంతికి వేకరు శుష్కజీవినై. 52

భిక్షుకుఁ డెవ్వడైనఁ గనుపించినచోఁ బయినున్న వస్త్రముౝ
దక్షణమెత్తి యిత్తునని తారసిలున్మది కాని, యంతలోఁ
బక్షములెత్తి నాకనెడు భావము కప్పెడు నీకు శంకలో
నక్షముఁడౌచు రాయివలెనై, కనుఁగొందును వాని వేదనల్. 53

కడుపునఁగాలు నాఁకలికిఁ గన్నులు చుమ్మలుచుట్ట, భిక్షకై
యడిగెడు నాదుసోదరుల నందరిఁ జూడఁగ లేక, నింట పె
ట్టెడు గతిలేక-నే నటమటించుచు వెట్టిగవచ్చి, వాకిటల్.
వడిఁబడమూసి, మాయవిధిపైఁ గురియించెద నగ్నిఖండముల్. 54

తమ్ముల రక్తమాంసములు దాహభరమ్మునఁ జీల్చి, భోగరా
జ్యమ్ముగ్రసించు నీధనికజాతికి లజ్జయె లేదటంచుఁ జి
త్తమ్మునఁదోఁచి, యిట్టి గడితంపుఁ బనుల్సహియించునేమి దై
వమ్మని యావటించెదను-బావురు మంచొక యావుపోలికౝ. 55

మన యాచారము నవ్వుటాలయి జగన్మాన్యంబు, వైదేశ్య వ
ర్తనమేదో యొక గౌరవంబనెడు జల్పాకుల్విజృంభించి, శో
భనహీనంబగు సంఘమున్గనినఁ దీవ్రజ్వాలికల్ వ్రేఁగు నా
మనమందుద్భట లూగుదున్ ప్రతిఘధూమ్యాగ్వ్యస్త తేజుండనై. 56

దాసత దాస్యమంచును యథార్థముగా గ్రహియించు తాత్వికా
వేశములేక, బుద్ధి చెడి, పీఁడులై, పరదేశశుష్కవి
ద్యాసముపాత్తమౌ చెనటి దర్పముతోఁ గికురించుచున్న యీ
నా సహజన్ములన్గనిన నా మది బీటలువారు, సద్గురూ! 57

మా హృదయంబు లాంగ్లుల సమాదరణంబున కప్పువోయి, వి
ద్యాహృతి యింటిబత్తెమున కంగముఁగాఁగ సమన్వయించి యి
ట్లే హతభాగ్యతన్గుమిలి యేడ్చుటకై నను లేక యీశ్వరే
చ్ఛాహతులౌదుమో! యెడఁద చచ్చినజాతికి మోక్షమున్నదే! 58

తరిమెడు నూత్ననాగరికతా మదిరారసమత్తులైన యీ
పురుషులు, దాని తత్త్వమును బూనిక నూహ యొనర్పరేమి దు
ర్భరగతి? దేశమంతయును బాడయిపోయిన లేవనట్టిని
ద్దరయిది చావొ-నిద్దురయొ? తోఁచదు రెంటికి మధ్యరీతియో! 59

ఆయువె యాంగ్లభాషకొఱకై-తటితీపులఁ దెన్గునోట "న
మ్మా" యని పిల్వనేరని కుమారునిఁగన్నది తెన్గుతల్లి! స్వా
మీ యెదక్రుంగిపోవును సుమీ, కని, భక్తియు భుక్తిలేని శు
ష్కాయువు లిట్టులే వితగఁ జావఁగనేవలెనేమి సద్గురూ. 60

జ్ఞానపరిష్కృతమ్మయిన స్వానుభవంబఱి, మానవత్వమే
గానికినమ్మి, కుచ్చితముఁగట్టిన గూండ్లు, మహాస్మశానధూ
మానిలభీకరంబులగు మాటలతో జగమేర్చు నీచుల
న్దాని పురస్కరింపరఁట! నా మది కెక్కడి శాంతి, సద్గురూ? 61

మదికినిఁ దీపిగాఁబలుకు మాటకు-నామడదూరమైన. యీ
హృదయవిహీను లెట్లు గమనింతురు? ప్రేవులు విప్పిచూపిన
న్నిదియొక గారడీయనెద రేమని లాభమువారిఁ? దండ్రి! నా
బ్రదుకున కిట్టి భాగ్యమును వ్రాసిన బ్రహ్మనుఁ దిట్టఁగావలెన్. 62

కాలినవత్తులట్టులు, వికారములై కళలేని శుష్క వి
ద్యాలయముల్-మనస్సను పదార్థమెలేని గురుల్-విజీర్ణ కం
కాళములైన పిల్లలనుఁ గాంచినఁ గన్నులుగుట్టు నాకుఁ. దం
డ్రీ! లయకాలనృత్యము ఫలించినదేమిర దేశమందునన్? 63

గాంగతరంగగీతములు కర్ణపథంబుల జోలవాడ, స
ర్వాంగములందు భారతమహత్వము పుల్కలురేఁప, నాశ్రమా
లింగిత క్రమపాదపతలిన్ శ్రుతులూరిన ముక్తిపుష్పసా
రంగము నాదుదేశమున రాలినదేమి శతహ్రదావశల్? 64

ఆ మునియజ్ఞవాటికలకన్నఁ బవిత్రములైన భావరే
ఖామహనీయముల్, తటవికస్వరనూత్నసుమాళి కన్నన్
గోమలముల్, దయాభరవికుంచితముల్, ఋషిపోతపూత హృ
ద్భూమిక-లందు హత్తినవిపో! పరమాత్ముని దివ్యగీతముల్. 65

శిప్రామందతరజ్జడోలికలపైఁ జెన్నారు సారంగ భా
లాప్రావీణ్యము-ముగ్ధమణ్డనవతీలజ్జాదరస్పర్శలీ
లా ప్రస్విన్నవిపంచికారసభర ప్రక్వాణముల్పోయి, జీ
ర్ణప్రజ్ఞల్, శ్రుతిచచ్చి నిల్చినవి, క్షుద్రంబైన దేశంబునన్. 66

రాసిక్యంబు నశించి నిల్చినది జీర్ణచ్ఛాయ, ప్రాచీన మే
ధాసంపత్తి గతించి దక్కినది క్షుద్రప్రజ్ఞ, యద్వైత భా
వాసక్తుల్ మరణించి పేర్చినది గర్వగ్రంధి, సత్కార్యని
ష్ఠాసౌజన్యము గూలిపోయినది, దేశం బేమిగానున్నదో! 67

అంతకునంత కేర్చి ప్రళయానిలమట్టులు దేశమెల్లనా
క్రాంత మొనర్చె రాక్షసవిలాసము, భౌతికమే మహార్థమా-
వంతయుఁ బారమార్థికతయన్నది మందునకైన లేదు, సి
ద్ధాంతములందె నిల్చినది ధర్మము. గుత్తుకఁ దన్నెఁ బ్రాణముల్. 68

పరనిందాకరణంబె హృద్యతరమౌ వాక్ప్రౌఢి, మద్యాదిపా
నరతుల్సభ్యత, ఘోరదుష్పథపదన్యాసంబు సంస్కారముల్,
పరనారీపరింభణాతురతయే రాసిక్యమీ, పాప మం
దీరకింప్రజ్ఞలు రాజకీయములు, దండ్రీ! యేమి వాపోవుదున్. 69

అంగదనంగవించు వికలాంగునిఁ జూచిన సాయమింత సే
యంగనలేదు పొమ్మ, పలుకైనను మెత్తనలేదు, కుక్క వో
లెం, గసరించిపైతురు-దరిద్రుని జీవితమన్న దెంత దా
మెంగిలిచే విదిల్చిన గ్రహించును-నిల్చునుగాదొ నా గురూ. 70

మనసొక పెంటకుప్పకు సమానము, చేసెడు చేఁతలన్నిటన్
దనయభిమాన దర్పములె తాండవమాడును, కుచ్చితంబె రూ
పెనసిన బుద్ధియైన గ్రహియింపదు లోకము, వేషధారి నె
త్తిన నుపవిష్టుఁ జేసికొను, దీని రహస్యముఁ దెల్పరా! గురూ! 71

ఒక పలుగాకి పెన్మిటికి నుత్తమ శీలవతీమతల్లి చి
క్కక మఱిచిక్కఁగా, నతఁడు కన్నుల కుండలు నీరుగారు నం
తకుఁ బడమోదుఁ దత్సతినిఁ, దాఁబెర చోటుల మేసివచ్చు-నా
సకియనుఁ జూచినప్పుడవశంబుగ నేడ్చెదనోయి, సద్గురూ! 72

ఈ లయతాండవంబును సహింపఁగ వేయిమనంబులైననున్
జాలవు దండ్రి! ముష్కరవిశంకటతాదవ భీమధూమ ప్ర
జ్వాలిత సంఘమున్గనఁగఁజాలను-జాలక తీర్పలేను-ఆ
ధీలము, తండ్రి! యీ విధురవీణకుఁ జీవికఁ జేర్చి యేడ్చెదన్. 73

తాడీతమైన నాగము విధంబునఁ జిత్తము రోఁజెడున్ రుషా
పీడితమౌచు, శాంతియు-వివేకము నిల్వదు,-పిచ్చియెత్తి నో
నాడుదు సంఘమున్-గఠినమై యది నన్ను బహిష్కరించి పో
రాడును-దానితో నవశుడై, యసహాయతఁ గ్రుంగిపోయెదన్. 74

పొరపడి నవ్వినన్-హృదయపూర్వకహాసము సేతుఁగాని,
త్వరముగఁ బాలలో విసముఁ ద్రావిన నవ్వులునవ్వి, యున్న స
ద్వరి వలపింపనేరను ప్రభూ! యవలేపభరంబటంచు నం
దరు విపులీకరింతురు, యథార్థముఁ దేల్చిన దొడ్డవారలై. 75

న్యాయమటంచుఁ దోఁచిన మనంబున జంకొకయింత లేక, య
న్యాయము నడ్డగించుటకునై ప్రయత్నింతునుగాని, తండ్రి! య
న్యాయము న్యాయమై వచనమాడుట నాదురహంకృతి ప్రకో
పాయితమంద్రు! తామొక యహంకృతి దేల్చిన భాష్యకారులై. 76

పొగడుటయన్న నాకు సరిపోవదు, నన్నెవరైన నమ్రులై
పొగడినఁ బొంగిపోయి యనుమోదము సేయను, నా ప్రశంసలో
నగుపడు కుచ్చితంబె, యయినన్ బలవంతముమీఁద నొక్కరిన్
బొగడఁగఁ జెడ్డ కారణము పుట్టును-నాగతియేమి? సద్గురూ! 77

"అకలుషవృత్తి భిక్షమునకై ననుఁ బొమ్ము-పరప్రశంస సే
యకు" మని యానపెట్టితిరి-యాగుణమొక్కటి లేనిదాననే
ప్రకుపితచిత్తులౌచుఁ బలుబాములఁ బెట్టిరి నన్నుఁ, దండ్రి! చా
వక యొక కొండచిల్వనయి పట్టితిఁ బ్రాణము మొండివాఁడనై. 78

పరులఁ బ్రశంససేసి నవభాగ్యము లందుటకంటె నాత్మ సు
స్థిరుఁడయి పుక్కపాత్రమునఁ దిన్నను నామదిఁ జింతలేదు, యీ
శ్వరు గుణతంత్రగీతములఁ బాడుచుఁ జిక్కని పూవువోలె, నా
పరువము వాడకుండ నిలపైమని, రాలినఁ జాలు, సద్గురూ! 79

పడగలుదాఁచుకొన్న వెనుపాములకై మనలేను-లేనిచో,
నడుగడుగందు వచ్చిపడు నాపదలన్నిటి కోర్వలేను-చే
విడువఁగలేను భోగములు-భీకరముల్గ్రహియింపలేను-నా
నడత విచిత్రమైనది, మనమ్ము విచిత్రతరమ్ము-సద్గురూ! 80

సుఖముల్జూచిన నందులో నొదిగికూర్చున్నట్టి దుఃఖంబు, జ్ఞా
నకృతిజ్జూచిన నందులోఁ బొదుగు నజ్ఞానంబు, ప్రేమైక శం
సకులజ్జూచిన నందులోఁగల భవిష్యద్దుర్వియోగంబు,-మా
మకచిత్తంబునఁదోఁచు శాంతి యెటు సంప్రాప్తించునో సద్గురూ! 81

ఒక్కఁడు, సాధువృత్తియయి యుండెడు వానికి, లేనిపోని పె
న్జిక్కులఁదెచ్చి ప్రాణము గ్రసింతువు-వేరొకరుండు-దుర్మద
న్యక్కృతశీలుఁ డప్పికొను నైకసుఖంబులు-దీనికర్థమే
చిక్కదు, తండ్రి! యోచనమునేయుట కెంతగఁ దల్లడిల్లినన్. 82

ఒకరుఁడు నీగుణ స్తవములోపికఁజేయుచునుండ, వెంటనే
పకపకనవ్వె భక్తు నొకభ్రష్టునిగా-నొకవెఱ్ఱివానిఁగాఁ-
బ్రకటముసేయు వేరొకఁడు వానికి శిక్షయెలేదు-పోని, వీ
నికె మరిశిక్ష వైచెదవు! నీ పరిపాటి విచిత్రమో గురూ! 83

పూవులబూవ నేలగడివోవఁగ నేలయటంచు-స్వామి! ప్రే
మావిలచిత్తుఁడై బ్రదుకునందుఁ దపింతు-క్షణక్షణంబు నె
న్నోవెలయింతు వీవు; భవదుజ్జ్వలలీలలఁ గూలిపోవు స
ద్యోవికరంబులౌచు; వినియోగముఁ దెల్పవదేమి? సద్గురూ! 84

ఆకసవీథిలోఁ దరఁగలై ప్రవహించు శకుంతకంఠ వీ
ణాకలగానముల్విని వణంకుదు-నేఁదదలభ్యశాంతి చి
త్రీకృతుఁడై విహంగత వరింతును!-పక్షులుఁగూడ క్షుద్రతా
వ్యాకులమైన యీ బ్రదుకు కట్టులు సాఁచునయేమి? సద్గురూ! 85

ఫుల్లములై, కపోతములఁబోలెదు, సంపెఁగ పూలవాసన
ల్సల్లెడు గాలులన్, రసభరంబు ప్రపంచము; కాద-కాదు-మే
నెల్లఁగృశింపఁజేసి గ్రసియించును మృత్యువు, దీని తత్వమున్
జల్లుటకే నశించె వివశంబయి-యెన్నియొ భావపుష్పముల్. 87

అడవులలో నొకమృగమై,
పడియలలో నీరుఁ ద్రావి, బ్రదికినచో, నా
కడుగడుగునందుఁ గలిగెడు
నడలుఁ గలుగవేమొకో?-దయాసుమభరణా; 87

పాపంబున కాకరమై
తాపమునకుఁ దానమైన తనువేదుచుఁ, జె
ట్టో! పుట్టగానొ! పుట్టిన
నా పుణ్యము పండిపోవునందును, దేవా! 88

పరుకంటఁబడక, యెందో
పరువము వెలిఁగించి, వయసు వ్రాలిన పిదపన్
ధరనొరగెడి విరిగా కను
నరజన్మము నొసఁగితేల? నా గురుదేవా! 89

ఔను ప్రభూ! మదీయ సకలాశలు నీవయి, పాపవృత్తికిన్
దానకమైన 'నే'నను పదార్థము పూర్తిగమాసి, బ్రహ్మ వి
ద్యానిబిడానుభూతి హృదయమ్మునఁ ద్రావఁగ నూహసేతు, నా
లోనె కుదింతుఁగోరికల, లోకము మెచ్చదటన్న చింతలన్. 90

చింతలు చిత్తమందెసఁగి. చిందరవందరసేయు నప్పుడా
వంతయు దుఃఖమున్పొరయనట్లుగ, నిత్యము నాత్మతృప్తిరే
కంతయుఁ దగ్గనట్లుగ, దయామతి దీవెనలిమ్ము! ముక్తి సి
ద్ధాంతవినోద; దీనజనతావనకారణజన్మ! నాగురూ! 91

పాపము, సౌఖ్యపుమ్ముసుఁగుఁ బై ధరియించి ఘటించినప్పుడా
చాపల ముత్తరించికొను జ్ఞానము నా కడలేదు-నీవె నా
కాపుగ నిల్చి యట్టి యవకాశమె యివ్వకు, తండ్రివైన నీ
ప్రాపున నాడనిమ్ము-పసిబాలకు పోలిక నన్ను సద్గురూ! 92

తలఁపులె కార్యరూపమును దాల్చును-బండిన యప్పుడట్టిచోఁ,
దలఁపులు చెట్టలై నను గృతంబున దూష్యములౌను మన్మనో
నిలయమునందు నీవెపుడణీయము దివ్వెగవెల్గి, కల్గు నా
తలఁపుల సంస్కరించుము, నితాంతదయాపరిణాహ! సద్గురూ! 93

ఆశకుఁబాదు నీ యభయహస్తము నా తలపైని నిత్య సౌ
ధాశన చంద్రికాలలిత తాండవముల్ జెలఁగింప. భావనా
కాశమునందు నీ వొకఁ డఖండరసాకృతి వెల్గు వెల్గుచున్,
నీ శివతాతికాంతులను నింతువుగాక! యెడందలోపలన్. 94

చీకటికోనవంటిదగు జీవితమందున శాంతిలేశమున్
లేక కృశించిపోయెడు మలీమససంధ్యలయందు, స్వామి! సు
శ్లోకము-నీ స్వరూప-మెదలో వికసించి, పవిత్రశాంతి స్వే
చ్ఛాకిరణంబులన్ వెలుఁగుఁజల్లుచుఁ దృప్తినిఁగా నొనర్చుతన్. 95

స్వామి! యసంఖ్యలౌకికవిపత్తులఁబోరి, యలంతఁగూర్చి, వి
శ్రామముగోరు నా యవసరంబుల, నీ వొక మాతృమూర్తివైఁ
ప్రేమతుషారబిందునివిరీసము-కల్పక పల్లవావళీ
కోమలమైనచూపు నొడఁగూర్తువుగాత! మెడందలోపలన్. 96

పలికిన, నూరకుండినను, బాడిన, నేకడఁజుట్టుచుండినన్,
నిలిచినఁగాని, నీ చరణ నీరజముల్-కరుణాప్రసన్నముల్-
కలకల నవ్వినట్టులు, వికస్వరరూపములైన యట్లు; నా
తలఁపున నిల్చుఁగాత! జనతాపనివారణకేళి సద్గురూ! 97

కలలెల్ల నీవయై వ
న్నెలు చిలికెదుగాత! సుగుణనీరధి! నీ క
న్నులలోని కాంతులే, నా
కలలకు జీవంబులౌనుగాత! గురూజీ! 98

అనునయశీతలమ్మును, దయాభరమంజిరతమ్ము, హాస చి
క్కణమగు నీ కటాక్షము వికస్వరకల్పకపాదపంబు-నా
మనమున నిల్చుఁగాత! మనుమానముచేఁ గొడిగట్టినట్టి శాం
తనిభృతసుందరంబయి తనర్చెడు, చిక్కనిప్రేమ దీపమై. 99

నీవే పలికించితివో!
దేవా! ముత్తెములవోలు దీవెనలిడి, తీ
వ్రావేశభాసురంబు-ము
దావహమగునట్టి నీ ప్రథమశతకంబున్. 100

* * *

పదహతిఁదిన్నగా వెనుక
పాటున వచ్చెదవేమి? యూరకే
బెదరఁగఁజేతువేమి?
వలపింపుల తియ్యనిచూపుఁ జూడకే
యదలిచిపోదువేమి?
నిలువంతయుఁ జెమ్మటపోసె, నీదు స
మ్మదమిఁక బెండుగాను? -
ఒకమాటయు నాడవిదేమిరా? ప్రభూ!

విభూతి శతకము

—:౦:—

శ్రీ రమ్యంబగు రూపుతోఁ బతిత హృత్శ్రీమల్ గటాక్షించి, సం
సారక్లేశ పరాఙ్ముఖత్వ సుఖసాక్షాత్కారతాసిద్ధి-స
ద్వైరాగ్యంబు ఘటించి, మోక్షపదవీ భద్రాత్ములం జేయు సా
కారబ్రహ్మము-సద్గురున్-సకలలోకస్వామి, నర్చించెదన్. 1

లోపల వెల్గు వెల్గులకు రూపము వచ్చుటటుండ, బ్రహ్మ వి
ద్యాపరిపూర్ణతా ఘటితమైన రుచిస్ఫురణంబుతో-జగ
ద్వ్యాపకుఁడై నవాఁడు, భగవంతుఁడ నిక్కమయైనవాఁడు-భ
క్తాపదఁ బాపువాఁడు-గురుఁ డస్మదుపాంతములన్ వెలుంగుతన్. 2

ఎవ్వనియేని దర్శనములిచ్చు సమస్తము, భక్తి కోటియం
దెవ్వనియేని నవ్వు గురియించును-శాంతి, యుగాంతకాలమం.
దెవ్వని యూర్పులందు జనియించెనొ ప్రాబలుకట్టి, ముక్తికిఁ
దివ్వె-పరాత్పరుండు-గురుదేవుఁడు, మాకు ననుగ్రహించుతన్. 3

తానుఁబరాత్పరుండనెడు తథ్యముఁగప్పుట కెట్టి వింతయో
గాని జరించు, మానవునికై వడి నొక్కొకసారినుండు, న
జ్ఞానివలెన్, శిశుక్రియ-ననంత విలాసనిశేష పుష్టితో
ద్యానము-సద్గురుండు-సతతమ్మును మమ్ము ననుగ్రహించుతన్. 4

నవ్వుల పువ్వులన్ గపట నాటకముల్ పచరించువాఁడు, పై
నెవ్విధినైన లోఁబడక నింద్రియముల్ వలగొన్నవాఁడు, ఁదా
నివ్వెఱపాటుఁగూర్చు రమణీయవపుః పరిణాహి, పాపికిన్
దవ్వగువాఁడు-సద్గురుఁడు, దారమతిన్ మము వెంటనంటుతన్. 5

అక్షినిడాఁచికొన్న నిటలాక్షునిఁబోలి, విభూతులెల్లఁ బ్ర
త్యక్షమునేయువాఁడు,-కమలాక్షునిపోలిక లోకరక్షణా
దీక్షితుఁడైనవాఁడు-గురుదేవుఁడు, బ్రహ్మనుబోలి వేద సం
శిక్షకుఁడైనవాఁడు, దయసేసి నిరంతర మోముచుండుతన్. 6

చిరముగ మాకునై తపము సేసెడువాఁడు, పవిత్ర పన్నగా
భరణము లేనివాఁడురుకృపా పరిపూర్ణవిలోచనాబ్జని
ర్భరమగు చూపుతోఁ బతితులన్ గరుణించెడువాఁడు, శిష్య హృ
త్పురముల నేలుఱేఁడు దరితోఁ గనిపెట్టునుగాత మమ్ములన్. 7

రాముఁడు తానయై విధికి రామునిఁ గొల్చెడివాఁడు, భక్తహృ
ద్భూములఁబొంచి చెట్టతలఁపుల్ గురిసేసెడువాఁడు, గమ్యమా
యాముషితుండువోలె నరుఁడై వ్యవహారము సేయువాఁడు, మా
యామృదితుండుఁగాని గురుడాప్తుల మమ్ము సముద్ధరించుతన్. 8

కారణజన్ముఁడై నిజముఁగప్పి పరీక్ష యొనర్చువాఁడు, మం
దారమనోజ్ఞమూర్తి, జనతా ఘనతాప కరాళ వృత్తికిన్
దీరుగడైనవాఁడుఁ, దరితీపుల నెయ్యము సేయువాఁడు, కాం
క్షారహితుండు, శిష్యహిత కర్మరుఁడౌ గురుఁడెప్పుడోముతన్. 9

నా కవితాకుమారివలె నవ్యవిలాసము లేనివాఁడు, ప్రే
మైకనిధానమైన హృదయంబునఁ దల్లినిబోలువాఁడు, ము
గ్ధాకృతి నొక్క చిన్నిశిశువన్ననుఁ జాలనివాఁడు, భావముల్
వ్రాఁకిన పెద్దఁవాడు గురువర్యుఁడు-మమ్ము శమించుఁగావుతన్. 10

మానవుడందమన్న నతిమర్త్యము నీచరితంబు, దేవుఁడే
గానియటన్న నా కథలు కల్పిత మంచని త్రోసివైతు నీ
వే, నినునేగతిన్ మది గ్రహింతుము? దైవమొ? కాదొ? చెప్ప వ
య్యా? నయనమ్ములున్న జనుషాంధులఁజేతువు మమ్ము, సద్గురూ! 11

ఇక్కడఁ గూరుచున్నపుడె యెక్కడనో యొకభక్తునింటిలోఁ
జిక్కకచిక్కి సాపడి వసింతువు, వేఱొకచోట బాధచే
స్రుక్కెడు శిష్యునిన్ మృదులసూక్తుల నూరటఁ దీర్తు-వింతకున్
నిక్కముఁ దెల్పవోయి! గురు! నీవనుబెందరొ? లెక్కపెట్టెదన్. 12

తలగడచేయిగా నిదుఁరదాల్తువు వచ్చినవాఁడవోలె, నా
"మెలఁకువ నిద్రలో", సకల మేదినిఁ జుట్టెదు, నమ్ముకొన్న భ
క్తులకునుఁ బుణ్యరూపమయి దోఁచెదు, నీయది నిద్రయన్న మా
మెలఁకువ వ్యర్థమై వెఱనిమీలిత నేత్రుఁలమౌదు, మోగురూ! 13

మఱియొకసారి నీలములు మాటిన చిక్కని చూపులెత్తి, యు
ప్పరమునఁజూచి, ఫక్కుమని పైబడి నవ్వెదు, నవ్వుటంచులన్
విఱిసి కొనంగ, నిర్మలకవేర సుతాచల దూర్మికంకణ
స్ఫురిత నిసర్గ శైత్యములు-పుణ్య ఫలంబులు-భావమంజరుల్. 14

ఇంకొకసారి మమ్ముఁగని హెచ్చరికించెదు, మోక్షకామినీ
కుంకుమ పత్రభంగములకున్ జిగి ముత్యపుటంచు దిద్దు, ని
శ్శంకమనోజ్ఞహాసముల, స్వామి! యపత్రపలోఁగిపోయి సా
శంకములైన సిత్తమృగశాబము లొక్కటగ్రేళ్లు దాఁటఁగన్. 15

పాటలపల్లకీ మృదుల పల్లవభా పరిభావియౌ జటా
జూటముసళ్ళవోఁ, బికిరి చూపులతో నటుచూచి, మస్తము
న్నాటితమున్బొనర్చెదవు, నా గురుదేవ! తదీయ మర్థమున్
బాటనసేయ నేరక మనంబులు-బుద్ధులు-సందడింపఁగన్. 16

కలగనునట్లు తండ్రి! చిబుకంబున హస్తము నూఁది, తీవ్ర ని
శ్చలతర దృష్టులన్ తతదిశావలయంబునఁ గ్రుమ్మరించి, ని
ప్పులసెగవోలెఁ గాంతి గడివోవగ నూర్చెదు-పూవులట్టి నీ
తలఁపుల నగ్నిఖండములు దార్చిన నెవ్వగలేవిరా! గురూ! 17

విరిసిన తమ్ములట్లుఁగనువిం దొనరించెడు కన్నుదోయి, కో
టరమునయందుఁ బుల్గుల విడమ్మునఁ జూపులు సుళ్ళుజుట్ట నెం
దరయక-నిన్ను నీవె మహితా దృతిఁజూతు. దుషార శైలకం
దరమునఁదొల్లి శంకరు విధంబునఁ జూచుట కర్థమేమిరా? 18

కలకల నవ్వు-నవ్వుల నిగారపుఁగాంతులలో ననేకమై
పలుకులు, చిన్నచిన్నగ విభక్తములై దెగిపోవనేవొ-ప్రాఁ
బలుకులు మాటలాడెదవు, స్వామి! గభీరత సైఁపలేని పి
ల్లలతలిరున్ దలంపుల వి, రాటములౌచు పరిభ్రమింపఁగన్. 19

చాతురి జారిపోవ నెకసక్కెములాడెదవేమి! తండ్రి మా
యాతన నీ తలంపునకు నంటినదో, మరిలేదో? మేనిపైఁ
గోఁతకు కారమున్ మెదపి కొట్టెదవేమి, దయావిహీనతా
శాతములైన వర్తనలు జ్ఞానులకంటిన విద్యలేమిరా? 20

తెగువగ నెడ్డొ కోటరముఁదీర్చిన యవ్వయువోలె, నోర్మిపై
ముగుదలకెల్ల నింటితనముల్ వచియించెద వానవెట్టుచున్,
మగలకు నీతిసెప్పెదవు-మౌని! తపస్వులయందువోలె, నీ
పగణితవక్ర వృత్తులు గృహస్థులయందును దొడ్డవాఁడవో! 21

అవునొకసారి పెద్ద వ్యవహారవిదుండువువోలె మోయ నీ
యవు, మఱియన్యులన్ జిదురులాడెద. వాడినవానికెల్ల నే
ర్పవియఁగఁ గొట్టు సెప్పెదు గదయ్య! భవన్నటనాధురీణతా
నవనవలీల లెన్నియయినన్గల వెవ్వరు దేల్తురి? నాగురూ! 22

పలికినమాటయే మరలఁబల్కెదు, చూపిన యట్టి భావమే
యలయక సోగబొమ్మముడియందు లగింతువు, చేసినట్టి చే
ష్టలెమరిఁజేసె దెందులకు? స్వామి! పదింబదివల్లె వేతువో
కళయొక నిత్యసుందరసుఖంబను నీతి సముద్ధరింతువో. 23

పులకలిగిర్చు హస్తములముద్రలు వట్టి, హసించు మల్లెపూ
పులకెనయైన చూపులను బూనిచి,-చూపులరేకులందు నీ
తలఁపులుదీర్చి, లేఁదలఁపుదారులభావముఁ గ్రుమ్మచున్ రసం
బులఁబ్రకటింతువేమి? పలువోకలఁజిక్కని దేవకన్యవై 24

నాగురుదేవ! నీభరతనాట్యమహంబులలోని సర్గఝం
పాగతివోలి భావములుపారుట గన్గొని, నా తలంపులున్
రేఁగెడు, నెచ్చటోపలవరింతు వియచ్చరకన్యకాసుధా
భోగమనోజ్ఞగీతములు పూచిన-పండిన-వింతదీవులన్. 25

శారద రాత్రివేళల మసారవిలోచనపింఛికా పరి
ష్కారముతోరమై, భువనసంతతిడక్కఁ గౌనంగ-రాస లీ
లారతిఁ జొక్కినట్టి చవులందలపించెద వేమొ! దివ్యబృం
దారమణీయభూములఁగదా! తొలి నాట్యములో జగత్ప్రభూ! 26

అలరుఁ బోలు వ్రేళులు లయానుగుణంబుగఁ ద్రిప్పిత్రిప్పి, భా
వలతలఁ బెంపుఁ దీర్చెదవు, స్వామి! యిదెక్కడి కర్మమయ్యా! నీ
జిలుగు పిసాళికన్నుల రుచిన్ గనుబొమ్మ చలించినంతనే
నిలువున నీరుగాఁగరఁగి నిల్తును నేనొక ముగ్ధరాధనై. 27

ఘల్లురు మంచు మ్రోయు చిరుగజ్జెలనాదములేకయే, లయా
భ్యల్లసితంబు సూపునలవున్, గటకాముఖ హస్తముద్రతో
నుల్లము దూరనేయు పిడియొప్పును జూచినదాది, ప్రేముడుల్
చల్లెడు నీ స్వరూపమె నిజంబుగ వ్రేలెడుఁ గన్నులందునన్ 28

నా వెనువెంటనే మధురనాట్యములాడెదు, చూచినంతనే
లేవిదియేమి చోద్యము? భళీ శ్రుతిసౌధవిహారియౌ జగ
త్పావనమూర్తి యిట్లు పసివారల పోలిక నవ్వి యాడునే?
తావులు గ్రమ్మ నీ సుచరితమ్ములు-కన్నులు నమ్మలేవురా! 29

అరవిరిచెక్కులన్ మధురహాసము బంగరుపూఁతఁబూయ, సుం
దరమధురమ్ముగాఁగఁ గరతాళముఁ దట్టెదు, వెన్కఁజూతు నా!
యెరుఁగనివాఁడవోలె గమనింపవు-చూడకయున్న ముగ్ధమం
ధరహసితంబుతో సుమకటాక్షము గ్రుమ్మెద వెట్టి వింతరా? 30

ఆల తలంపులందు మధురాశలు పూవఁగఁగాచికొన్న, గో
పాలకమూర్తి! ధేనువుల భంగిమమున్ గరుణింతువో! జగ
త్పాలకముల్-గటాక్షములు-వాల్తువో! యాశలుపండఁజేతువో!
మేలములాడి మేనిమిరి, మెత్తువొ? అంతటి భాగ్యమా! ప్రభూ! 31

నేనొకధేనువై, సొగసునింపిన, నారమణీయశృంగ కో
టీనవకుట్మలంబుల గడింతువు పట్టుల కుచ్చులన్, గళల్
పూనినకన్నులందుఁ దడిముద్దులఁ బెట్టెద వేమొ? శుష్కవాం
ఛానిబిరీసమీ-మనుజ జన్మము-నాపయి నెత్తితేమిరా! 32

ఆరవిరిదండ శృంగములయందు, లలాటమునందుఁ గుంకుమం
బరుతను గర్ణికారసుమహారము, విచ్చిన యంఘ్రులన్ మనో
హరమగు పచ్చిలేఁబసవుటందముతోడ, వసంతకోమలా
భరణ యుమాకుమారివలె, భావము పండఁగఁజేయనా! ప్రభూ! 33

కరువునుబోసినట్టు లొడికమ్ముల వ్రేఁతల జీవనమ్ము, పు
ల్లరుచిరమూర్తి! నీవు-వ్రజరాజు చరించెడువేళ, నీదు మే
నొరసి యనన్యసౌఖ్యచలితోర్ములఁ మ్రాఁ గనువైచియున్న నా
పరువముఁజూచి నీవె పెరవానివలెన్ వెలిగందవా? ప్రభూ! 34

యామునభూములం, జలదులంశ యొనర్చెడువేళఁ, జంచలా
క్షీమహనీయమణ్డలవశీకృతుఁ, గన్గొని, సోపహాస ల
జ్జామధుర్మార్ద్రదృష్టులను జల్లుచుఁ బూజయొనర్తునేమొ? కా
నీ, మనుజత్వమిచ్చితివి నీమది యెంతటి కర్కశంబురా! 35

నాఁటిబెడంగులన్ విడచినావనుమాటయెకాని, నీకు నే
లోటుర! మంచిముత్తెపుసరుల్, దలపైని శిఖండదామమున్
బాటనసేయమి న్నొసలిపైబడు వెండ్రుకలన్ని యన్నియున్
నీటుగ హత్తికొన్నయవి నీకిపుడున్, దొలిఁనాటి పోలికన్. 36

అలనుఁగాచినావు, మునుపంగదతోదురపిల్లుచున్న భ
క్తాళినిఁగాచినావిపుడు కమ్మనివేణువుఁబూని రాగల
క్ష్మీరమణీయమూర్తిఁ గులికించితి, నాఁడులు నేఁడుగూడ లీ
లారసమిచ్చి మా హృదయ రాగము గొంటివి, భేదమేమిరా! 37

నీవు కిశోరకృష్ణుఁడవె నిశ్చయమోయి! గభీరవృత్తికిన్
దావలమౌ భవత్సుచరితమ్ములు, నాఁడును నేఁడు-భక్తచే
తోవహముల్, ధరావలయ ధూర్వహముల్, గనులున్నవారు నీ
పావనమూర్తి గ్రోలెదరు భక్తిపుటంబుల-లేక లేదుపో! 38

నేనెటనున్న నా వెనుకనే చరియింతువు నీడవోలె, స్వా
మీ! నినునేగతిన్బిలుతు? మిత్రుఁడవందునొ! దండ్రియందునో?
యానతియిమ్ము, మజ్జననియందునొ? నా కడమాటఁ జెప్పనా?
దీనుని నన్నుఁ-గాచికొను దేవుఁడవందును సుమ్ము! నా ప్రభూ! 39

పదహతిఁదిన్నగా వెనుకపాటున వచ్చెదవేమి? యూరకే
బెదరఁగఁజేతువేమి? వలపింపుల తియ్యనిచూపుఁ జూడకే
యదలిచిపోదువేమి? నిలువంతయుఁ జెమ్మటపోసె. నీదు స
మ్మదమిఁక బెండుగాను? నొకమాటయునాడవిదేమిరా? ప్రభూ! 40

ఆకుచలించినంత పవనాహతి నీసడియంచుఁజూతు, మా
ధ్వీకమదారుణంబయిన తిన్నని కంఠమునెత్తి కోయిలల్
గేకలువెట్టి నంతఁ బరికింతును వేణునినాదమంచు, నా
యాకులపాటు నీకు నగవైనది-యెంతనియేడ్చి కొందురా! 41

కలువలతోడనే బొమిడికంబు రచించితి, వెద్ద నెమ్మి యీఁ
కలుసవరించి; మల్లెలనుఁ గట్టితి లేమొలనూలు, కొండ గో
గులఁ గడియాలుఁదీర్చితిని. కూరిమిఁగైకొనలేవు, వింత బా
గులపసివాఁడ! యెవ్వరికిఁగూర్తును! కన్నులఁజూతురా? ప్రభూ! 42

కనుఁగొనయంచులందు కళఁగారఁగఁజూచుట యొక్క-వింత, పై
కొని నెఱమావిపూఁత గిలకొట్టుచు నవ్వుట యొక్క-వింత, తి
న్ననియెలుఁగిచ్చి ముగ్ధవచనంబులు పల్కుట యొక్క-వింత, యొ
ప్పిన నెఱకాఁడ! నీచెనఁటి వింతల నెన్నిటిఁజెప్పి కొందురా! 53

రా మధుముగ్ధమూర్తి! యిటురార, సుగంధిలకీర్తి! చక్కన
య్యా! మదమత్త గోపవనితాంతరమానము దోఁచికొన్న దొం
గా! మిడిమేలపుం వయసు కల్లరిచేఁతల మోసపుచ్చి, యే
లా మదిఁదూలఁబుచ్చెదవురా? అతిలోక విలాస సుందరా! 44

రాలఁజిగిర్చు చూపుల కురంగము పోలికఁ జూతువేమి? ము
గ్ధాలసమూర్తి! పాటల జటాభరణంబు శిరీషమాల, పై
పైలయసూపఁ గన్బొమలవంచుచు నాట్యముఁ దీర్తువేమి? శో
భాలులితాంగ! నీ మనసు పజ్జల నేతలఁపుల్ ఫలించురా? 45

పరుగిడిపోదు వెవ్వరినొ పట్టెడువాఁడవు పోలె, వెంటనే
మరియొకరాయిపై నిలుతు మౌనముగా, నలపచ్చి కన్నులే
దెరువ, వదెంత పిల్చినను దీయని పల్కులఁ బల్కవేమి! యే
ర్పరుపఁగరాని నూతన విలాసము లెంతటి చేఁతలో! ప్రభూ. 46

మంకెన పూలరేకులను మచ్చరికించెడు నీదు మోవిపై
నింకిట పొంగఁజేయకుమ! యీ తెలి ముత్తెపు నవ్వుపాటకై
రంకు సమూహమాత్మ పలలంబుల నుంకువ పెట్టునట్లుగా
సంకటపాటుఁ జెందితిమి-చాలును నీచెలికారపున్ గతల్. 47

అడ్డపుఁదారులందు చరణాబ్జములుంచి, భయమ్ములేని యా
పడ్డయువోలె దూఁకెదవు, స్వామి! కఠోరములైన ముండ్లు నీ
కడ్డమురావొ! కోమల పదాగ్రము లింతకు వాడు చెందునో!
గడ్డముబట్టి వేడెదనుగా! రహదారినిఁ బోవరా ప్రభూ! 48

చటుకునఁ గంటకం బొకటి చొచ్చిన నీపదమందు, వెంటనే
చటుకున నామదిన్ నిశితశూలము నాటును-నీదు మోవిపై
నలవిటినవ్వు భక్తులకు నామెతఁబెట్టిన యంత నామనోం
తరమున వేయి వెన్నెలలు నాట్యము లాడునురా-జగత్పతీ! 49

అగణితకాంతి చంద్రకితమైన మనోహర వక్త్ర మెత్తితీ
యగ నొకమాట పల్కితివ? యాసలు దూయును నాకు, భాగ్యముల్
జగమునవెల్గి త్రుళ్లిపడు చందముదోఁచును, గన్నులందు ధా
రగ స్రవియించు బాష్పములు లజ్జకు లజ్జయెలేదురా ప్రభూ! 50

మాటకునే శిరీషకుసుమాంగిని గోపిక, నీవె యీ జగ
న్నాటక సూత్రధారి యదునాథుఁడు-పై పయినేమి చెప్పనా
బోఁటులనేనె రూపగుణభూషిత, నప్పుడు నీవె నాదు మో
మోటముగోరి, మేనలసిపోదువా పోవవా? యేమిరా, ప్రభూ! 51

అచ్చపుఁబూలవంటి దరహాసముతావులు కెంపు మోవిపై
నచ్చుపడంగఁ, బుణ్యఫలమై మనయింటికి వత్తువంచునే
ముచ్చట నెన్ని దుస్తులనొ పూనితి, మార్చితి, స్వామి యింతకున్
వచ్చుటటుండ వత్తువను వార్తయు రాదు-జగన్మనోహరా! 52

పూవులమాల లెవ్వరికిఁబూనుతు వాడునొ యేమొ? చందనం
బే వలరాజు దేహమున కింపుగఁబూయుదు హేమపాత్రలం
దావిరియౌనొ, నా నిడుదలౌసెగ యూర్పుల నింక కన్నులన్
జీవము లెట్లు నిల్పుదును జిక్కకపారునొ యేమొ? నా ప్రభూ! 53

అవునవులే! మహాబిరుదమందిన పెద్దవు! చిత్తమేర్చుద్రో
డవు! పిడిబాకుచూపులు గడల్కొనఁజూచుట యేమి దానిపైఁ
గవకవనవ్వులేమి!-గడుకల్లరిమారివి బాసదప్పు గా
రవమది నీకె దక్కినదిరా! సవిలాసకటాక్షసుందరా! 54

పలికిన ముత్తెముల్ ప్రిదిలిపారునొ! లేఁతగులాబివంటి నీ
తలఁపులు జారునో! నవసుధామధురంబగు పల్కుపల్కి నా
కలకిలికించితంబునకుఁ గాంతులు దిద్దుట మేలొ! లేక పూ
వులవలె నిల్చి మౌనమునుఁబూనుట మేలొ యెరుంగఁజెప్పరా! 55

వచ్చెదనంచురాని మగవాఁడవటంచన బేల! యిప్పుడే
వచ్చితి! నీ యొనర్చిన యుపాస్తి గ్రహించితినంచుఁ జూపి నా
కచ్చెరుపాటు గూర్చెదవయారె! యనేక శరీరవృత్తి నీ
కచ్చినవిద్య యౌనుగద! యౌవతమానస పశ్యతోహరా! 56

ఏతనువెత్తివచ్చి భుజియించితి నా గృహమందు, భక్తిచేఁ
గాతరమైన నా నిడుదకన్నుల నెవ్వరి రూపుగంటి, భా
వాతురముగ్ధ మీ హృదయవల్లకి నే హృదయేశుమూర్తి సం
వీతములైన గానములు వింటివి? నిక్కము దెల్పరా ప్రభూ! 57

భీతమృగీవిలోలములు విచ్చిన కల్వలపూలు సంభృతే
చ్ఛాతత భారభుగ్నములు చల్లనివెన్నెల చాలు బాష్ప ధా
రాతిగముల్ సరోజముకుళాతినిశాతములైన యట్టి నా
కాతరదృష్టి మంజరులు కంఠమునన్ బెనవై వలేదురా? 58

భోజనవేళయందు మొగమోటముఁబూనితి వేమొ! నీకు నా
పూజలు నచ్చెనో! వితగఁబోయెనొ! నెమ్మదివత్తిఁజేసి నీ
రాజనమెత్తినానొ! కలలన్బడి విస్మృతిఁజెందినానొ! యు
ద్వేజితవృత్తి నెన్ని చెడుతెర్వులఁజొచ్చి పరీక్షసేతురా! 59

బాధితభక్తలోక ఘనపాపనివారణశౌణ్డమైన నీ
పాదములందు వాసనలుపండిన గొజ్జఁగినీరు వోసి స
మ్మోదముసేసినానొ-తడివోవఁగఁ కొంగుల నొత్తినానొ లే
దో! దయసేయవేమి? కొతుకుంచిన నాపయినొట్టురా ప్రభూ! 60

చక్కెరపాలువోలె సరసంబుగఁ జల్లగఁబల్కి మోదమున్
గ్రుక్కిళులిచ్చినానొ! వలగొన్నభయంబున దాపుదాపునన్
నక్కుచుఁ జిల్లుకూనవలెనై మరుమాటయె లేక యుంటినో
నిక్కముదెల్ప వోయి విభు! నీకు సభక్తి నమస్కరించెదన్. 61

ఏమది? కామరూపముల నెత్తెడు నేరుపులున్నవంచు నే
మో! మదిలోనఁ ద్రుళ్ళిపడిపొంగెదు నేరుపు నిక్కమైన స్వా
మీ! మఱినేను గావెలయుమీ! గనులారఁగఁజూచి చూచి యా
నీమహనీయపాదముల నించెదఁ జూపుల క్రొత్తముత్తెముల్. 62

నీవు క్షణంబులోపలనె నేనుగమారెదవోయి! యోగవి
ద్యావశివై యనంతరము తత్పరిణామము నుజ్జగింతువున్
గేవలభక్తితో భ్రమరకీటము వోలిక నెన్నియేండ్లకో
నీవుగ నౌదువేమొ! పయినేనగు జాడలుకావురా ప్రభూ! 63

నాకును నీకు నొక్కటె మనంబయినన్ మఱినీవె యౌదునో,
నాకల యీ స్వతంత్రత యనంతము భక్తిసుఖంబు లీనమై
లేకయెపోవు నేమిరభళీ! యికచాలు నభేదభక్తి స్వే
చ్ఛాకలకోకిలమ్మువలెఁ జల్లఁగఁబాడఁగఁ నీయరా ప్రభూ! 64

నేనిఁనుగొల్చు భక్తుఁడయి నీవు మదక్షులనీ డలందు లీ
లానటనంబుసేయు వ్రజరాజుగనున్న నిఁకేమి లోక వాం
ఛానిగడంబులన్దగిలి చావక నిర్మలమోక్ష లక్ష్మికిన్
దానకమైన నీగుణకథల్ వినుతించి, తరించి పోయెదన్. 65

స్వామి! చలజ్జవేజముల చాయలు పొంగిన చూపులెత్తినా
నోములు పండఁజూతువా? మనోరథముల్పులకింప నీల్చినా
తో మఱుమాటలాడెదవా! తుందిలమౌ కరుణాభరంబుచే
కోమలహస్త మెత్తి యొడఁగూర్తువా! నీతొలితాకుఁ జల్వలన్ 66

ఏగతివత్తువోయి! వచియింపుము ముందె చిరత్నరత్నశో
భాగణనీయమై జిలుగు బంగరుఁ జిల్కలతోడ మన్మథా
జ్ఞాగమ సూత్రపఙ్క్తులకుఁ జక్కని వ్యాకృతివోని తేరిపై
వ్రేగుగనిల్చి యొక్కపృథివీపతివై కనువిందొనర్తువో! 67

ఘల్లురు ఘల్లుమంచుఁ జిరుగజ్జెలు పాటలువాడ రాగముల్
చల్లెడు పద్మరాగమణిసంతతిలేఁజిగురీన నంచులఀ
ద్రుళ్లెడు నాణిముత్తెముల తోరణముల్చెరలాడ బంగరుఀ
పల్లకియందు వచ్చెదవా స్వామి! విలాసము సందడింపఁగఀ. 68

మల్లెలతోఁడగట్టిన విమానములో నవకల్పవల్ల రీ
పల్లవచామరంబులను వైవఁగఁజుక్కలె కన్నెలౌచు రా
జిల్లెడు నీల కృష్ణతులసీమధురాంగముతోడ వచ్చి నా
యుల్లముఁ జల్లఁజేసెదవా! యోయి! శిఖండవిముగ్ధకుంతలా! 69

క్రొవ్విరి మల్లెమంజరితకుంతలభూమి, శ్రవోయుగంబునన్
మవ్వపు కర్ణికారములు, మధ్యమునన్ సుమకాంచి, మానముఀ
ద్రవ్వెడు పారిభద్రముల దండలు సేతులఁబూని, నీటుగాఁ
బువ్వులరంగఁడై మెఱసిపోవుగదా! జగదేక మోహనా! 70

ఇట్టులె సద్గురుండవయి యీ పరిణాహిజటాళితోడ, నే
కట్టునఁ బొట్టు మార్చకయె, కమ్మని పూవుపెడంద తోడనే
నెట్టనవచ్చి తీరవలె నీ మటుమాయల విద్యఁ జూపినన్
యొట్టుసుమీ! యిఁకెన్నటికి నుండవు తీయని భావబంధముల్. 71

నీకు రుచించునట్టి కమనీయ పదార్థము లెట్టి పెట్టివో
నా కెఱఁగింపు ముందుగనె నా హృదయాంతరరోచి! ముగ్ధభా
వాకరమూర్తి! ప్రాణములనైనను నర్పణఁజేసి తెచ్చి నీ
రాకకుఁ గాచియుండెదనురా! దళితేంద్ర దృషన్మహోచ్ఛవీ! 72

కలకలలాడు వెన్నెలలకై వడి శీతలమై, గులాబి ఱే
కుల రసమూరినట్టి చిరుగొజ్జఁ గినీటనుఁ బాద్యమిత్తునో!
పిలపిలదోఁగు బాష్పముల వెచ్చని ధారలు గ్రుమ్మరించి పై
నొలసెడునూర్పు వేడి తడియొత్తుదునో సెలవీఁయరా ప్రభూ! 73

గిలుకు మెఱుంగు టందియలఁ గ్రిక్కిరియన్నిరు ప్రోఁత, మోవిపైఁ
గల దరహాసవల్లరులు గ్రమ్ముముఖంబది యుందగించునో
పలపల కంటినీరురలి పారెడు చెక్కులతో, హతాద్వ్యథా
కులితముఖమ్మెదుర్కొనఁగఁ గోరెదవో! వివరింపరా ప్రభూ! 74

తరుణసరోజదామములు దామవిమేలో! యురంబునఀ మనో!
హర తులసీవినీలదళ హారముమేలో! శిఖండముగ్ధ శే
ఖరమునఁ దావులొత్తుకొను కల్వలదండలు గోరికొందువో!
దిరిసెనపూల పుణ్యములుఁ దీర్చెదవో! దయసేయరా ప్రభూ! 75

నున్నదనంబుగా నలుగు నూరుదునా! కనుదోయిఁ దీర్ఘగ
బ్రన్ననికజ్జలం బిడుదునా! కురులం దడియొత్తి దేర్చఁగన్
సన్నజరీటువాలుఁ గొననా! యిదె కంకతికమ్మ చాలునా!
తిన్ననిదర్పణం బిచటఁ దీర్తునా! యెద్దియు విస్మరింపనా! 76

అడుగులు నేలపై నిడెదనందువు స్వామి! కఠోరభూమిపై
నిడుటది యేమి? నీ పదము లేద్దెరఁ గందకయుండునేమి? నా
యెడఁద సుఖించునేమి? తగునేమిర! ప్రన్ననివెల్లపట్టుప
చ్ఛదముల విచ్చియొండెదను సద్మమునన్ దయసేయరా ప్రభూ! 77

వచ్చెడువారినే యెదురువత్తును, త్వత్పదపంకజాతముల్
గ్రుచ్చి-కవుంగిలించుకొని-క్రొవ్విరి దండలువైతుఁ, గౌతుకా
భ్యుచ్ఛలితంబులై యెదురు పొంగులు వోయెడు చూపులెత్తి, పై
పెచ్చుగరేఁగు నీ హృదయవీధి లగింతునురా! జగత్పతీ! 78

క్రొమ్ముడివీడి రొమ్ముపయిఁ గుంతలముల్వ్రేలాడ, దీవ్రవే
గమ్మునఁ బాఱగా ననదుగౌనసియాడ, మధూకమాధ్వి వా
క్యమ్ములు వల్కఁగా గళమునం దెలుఁగువణఁ కాడవచ్చు, నా
కమ్మని వాలకమ్ము నిడుగనున్నలఁ జూతువురా! మనోవశీ! 79

ఈ నినుఁజూచునప్పు-నిలువెల్లను గన్నులు, సేవలో సుఖం
బానెడు నప్పు-నాదు నిలువంతయు చేతులు, పల్కుపల్కు నీ
యానతిఁ గోరునప్పు-నిలువంతయు నోరులు, నీ స్తవంబునం
దేనురమించు నప్పు-నిలువెల్లను కంఠము లీయరా; ప్రభూ! 80

వల్లకిఁబూవి పంచమముఁ బట్టుదునో! కుతిలేక రమ్యమౌ
పిల్లనఁగ్రోవి తారశ్రుతి పెట్టుదునో! జయదేవు మాధురీ
పల్లవితంబు షట్పదినిఁ బాడుదునో? కుతి, సూరదాసరా
గోల్లసితం బుజేర్చెదనో! ఓ నవనీతసమానమానసా! 81

రాగములందు నా హృదయరాగముఁ దీర్చుచు మార్గరీతితో
నే గమనించి పాడుదునో! నీవాక శాస్త్రసమ్మోదిలేక దే
శీగతి జన్యరాగములు సెప్పుదునో! స్వరనిర్మితిన్ హృదు
ద్వేగముఁ గోచరించెదునో! పింఛకలాపరిరోచికుంతలా! 82

తాళము దప్పెనంచుఁ గరతాళముఁ దట్టెదవేమొయోయి! బా
వాలసమైన నామఱ పాటునుఁ జూడవొ? పూలరేకులీ
తేలఁగవైచు నేత్రములతీరు గ్రహింపవొ? నీవు ముందటన్
బోలఁగ నిల్వఁగాఁ దెలివిపుట్టునె? దేహము విస్మరింపనే! 83

ఈ నిబిడానుభూతిపలుకే బెకలింపదు, తండ్రి! పాటయే
తానముగాఁగ మారినది, తానము పై పయి రాగరూపమున్
బూనినదింక రాగమునుబుట్టక, రోదనమేమి నిల్చునో!
మౌనమె దక్కునో! మృదులమానస మెంతటి బాధసేయురా! 84

నీవు మహేంద్రచాపరమణీయుఁడు చూపులఁ బచ్చిముత్తెముల్
గ్రోవులఁ జిమ్మునప్పు గనుఁగోనలు మూతునొ యేమొ! సౌఖ్యమూ
ర్ఛావిధియాస దీరఁ గనులన్ గననోచఁగనైన నీదు మా
కావలమేమిరా! కుసుమకల్పము మానస మేమిరా, ప్రభూ! 85

చూడఁగలేదపజ్ఞతను సూపెనటంచని తప్పునెంచి, పా
రాడవో యేమొ! నా కనులయంచుల, నా హృదయంబులో, రుచుల్
వాడని గద్దెపైఁబొలుచు రాజెవఁడో గమనించుకొమ్ము! వె
న్కాడిన నీవు నా విభుడె కావని దిక్కులఁజాటి చెప్పెదన్. 86

నా రతనాలపంటవయి, కలలోని కడానిమేడవై;
కోరికలిత్తు నీకుఁ గయికొమ్మవి పల్కెదవేమొ? దేవ! నా
కోరికఁ దెల్పనా!-జలజకుట్మలరూప విశాలదీపమై
కూరిమి నాయెడంద గుడిగోపురముల్ వెలిగించి వేయరా! 87

నీ చరితామృత శ్రవణ నిర్మల నిర్ఝరిణీవిలోలవీ
చీచయడోలికా నటన జీవనమౌ నొక రాజహంసనై
నీ చరణద్వయీ కమలినీదృఢ బద్ధ మనోనురాగుఁడై
నీ చరితంబుకే బ్రదుకనిమ్ము! మదీయతపోవనస్పతీ! 88

తూరుపుఁగొండ నెత్తములఁ దోఁచెడు సూర్యునిఁబోలి, క్రమలా
క్షారుణమైన నీవెలుఁగు గన్పడుఁగాత! జగానఁ దైలపున్
ధారయువోలె నేకగతిదప్పని నీపయి నమ్మకంబు పొం
గారునుగాత! శోణితమునందు నెడందను నాత్మయందునన్. 89

నాజననంబు ధన్యమగునట్లుగ నన్నుఁ బరీక్షసేయనే
యోజను నీవుఁ బూనుకొనియుండిన, నిల్వఁగనేర్చు సాహస
భ్రాజితమైన శాంతినిఁ బ్రసాదము సేయుము-భక్తివీరతో
ద్వేజితమైన యాత్మ బలిపెట్టఁగనీ! భవదీయపూజలన్. 90

గురుఁడు పరాత్పరుండనని కూళమొగంబు-మహాస్మశానభీ
కరమలినంబు; వానిఁగనఁగల్గుట-జన్మసహస్రపాప దు
ర్భరపరిణామ; మాయవసరంబులె జన్మకు లేక పుణ్యమం
దిరములు-నీకనుం గొనల నీడలు చుట్టునుగాత! వప్రమై. 91

గురుఁడు పరీక్ష సేయుటకుఁ గోరినఁ బ్రాణములైన, మోముపై
జిరునగవప్పళింప బలిసేయని శిష్యుడు-నాత్మఘాతి, దు
శ్చరితుఁడ-యట్టి పాంసులునీ సంగతిఁ బొందక హెచ్చరింప స
ద్గురు వరమూర్తి, నాపయినిఁ గోటివిలోచనముల్ ధరించుతన్. 92

గురునకు బాససేసి యొడఁ గూర్చని పాంసులజాతి, పాపకిం
కరుడగువాడు-వానివచనమ్ములు వినులు నొచ్చినంతనే
చిఱచిఱలాడి నాశనముసేయును సాధక శేముషీహితం
కరమగు భక్తి, జన్మకొడిగట్టు ననంతములైన దుఃఖముల్. 93

దురిత కుఠారము-సద్గుర
చరితంబునఁ దప్పులేర్చు జాల్మునితోడన్,
బెరసి యనర్థము సేయక
గురువరుఁడే కాచి, తెలివిఁ గూర్చెడుఁగాతన్. 94

హరుఁడన్నను. గురుఁడన్నను,
హరియన్నను, భేదమెంచనట్టిడులు-మహా
పురుషులు, నాపయిఁ గురియిం
తురు మధురాశీస్సులు సువర్ణతోయజ దళముల్. 95

గురుఁడే పరాత్పరుండని
యరసి, తదిష్టంబె యిష్టమయిఁ బ్రదికెడు భా
సురమూర్తి గృహాంతరమునఁ
బురువై పుట్టినను చాలువో! గురుదేవా! 96

గురునిమహత్తు లోకములకున్ వెలయించెడు దీక్షతో, జగ
ద్గురులయి, యాత్రిమూర్తులనుగూడ వశీకృతులన్బొనర్చి; దు
ర్ధరమగు బ్రహ్మతేజమున ధారుణిఁ బూనినవారు-కాలమం
దరుగని వారు-సన్మనుల యాత్మలు-మమ్ము సముద్ధరించుతన్. 97

ఖచరులనెల్ల మృత్యువు ముఖంబునఁ గాచెడికోర్కెఁ జేసి రా
త్రిచరసతీర్ధ్యుఁడౌచు; గురుదేవుని యోగిరమాత్మ మాంసమున్
బచనము సేయఁగాఁ బడునవస్థకుఁ దాళిన శిష్యుఁడ మ్మహా
కచుని యఖండతేజము-వికస్వరమై మమునేలుఁ గావుతన్. 98

మమ్ముసముద్ధరించు నియమమ్మునకే యిలఁబుట్టి, మాకుబో
ధమ్మొనరించి దేర్చుటకె తా మృదుసూక్తులు నేర్పి; మాకు మో
క్షమ్మొడఁ గూర్పనే మహిత సాధన సేసెడువాఁడు-సద్గురుం
డిమ్ముగ మాతలంపులు గ్రహించి కృతార్థు లఁజేయుగావుతన్. 99

కం॥ నీవే నేనయి, నీ మృదు
భావములే నావిగాగఁ జిలికించితివో.
దేవా! ద్వితీయ శతకము
పావన భక్తి ప్రపూత పదనాట్యములన్. 100

* * *

ముద్రణ : క్రాంతి ప్రెస్, మద్రాసు-1.